# అక్కడ వృధా.. ఇక్కడ వ్యథ


కొత్తగా నిర్మించిన చేపల మార్కెట్


డిపో వద్ద చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

నిర్మల్‌లోని భాగ్యనగర్‌లో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన చేపల మార్కెట్ వినియోగంలోకి రాకపోవడంతో మందుబాబులకు అడ్డగా మారింది. భాగ్యనగర్ నుంచి ఈద్గాం చౌరస్తాకు వెళ్లే ప్రధాన రహదారిపై బస్‌డిపో ఎదుట చేపలు విక్రయించడంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంత్రం వేళ వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండడంతో వాహనదారులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి నూతనంగా నిర్మించిన చేపల మార్కెట్‌లో విక్రయాలు జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

- నిర్మల్ ఫోటోగ్రాఫర్: ఫిబ్రవరి, 24


↑ కొవ్వొత్తులతో పాల్గొన్న నర్సింగ్ సిబ్బంది

# రిమ్స్‌లో ల్యాంప్ లైటింగ్ సెర్మనీ

ఎదులాపురం, ఫిబ్రవరి 24: ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో 2024–25 విద్యా సంవత్సరంలో మొదటి ఏడాది నర్సింగ్ విద్యలో చేరిన వారికి సోమవారం ఘనంగా క్యాపింగ్ (ల్యాంప్ లైటింగ్ సెర్మనీ) వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదటి సారి ఏకరూప దుస్తులు, నర్సింగ్ క్యాప్ ధరింప చేసి కొవ్వొత్తులు వెలిగించారు. ఈ సందర్భంగా రిమ్స్ నర్సింగ్ సూపరింటెండెంట్ రమాదేవి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అనిత మాట్లాడుతూ వివిధ రుగ్మలతో బాధపడే వారికి వారు ఎల్లకాలం గుర్తించుకునేలా స్వచ్ఛందంగా సేవలందించాలన్నారు. రోగులు వ్యాధులతోనే కాకుండా కొందరు మానసిక వ్యాధితో బాధపడే వారుంటారని అన్నారు. అలాంటి వారిని గుర్తించి వారి మనోవ్యాధి నయం చేయడానికి సైతం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది వనజ, మెర్సీ, నళిని పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రం పరిశీలన

దస్తురాబాద్, ఫిబ్రవరి 24 : ఈ నెల 27వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లోని పోలింగ్ కేంద్రాలను రూట్ అధికారి జాడి తిరుపతి పరిశీలించారు. పోలింగ్ కేంద్రం 101, 62ను పరిశీలించారు. మౌలిక వసతులపై ఆరా తీశారు. వసతులు, రూట్‌మ్యాప్ పరిశీలించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు వెన్నెల, అంగన్‌వాడీ టీచర్ రత్నామాల ఉన్నారు.

## ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తనిఖీ

దస్తురాబాద్, ఫిబ్రవరి 24 : నిర్మల్ జిల్లా దస్తురాబద్ మండలం పెద్దూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం మండల విద్యాధికారి గంగాధర్ తనిఖీ చేశారు. రికార్డులు, ఎఫ్‌ఎల్‌ఎన్ తరగతులు పరిశీలించారు. విధిగా ప్రతిరోజూ పాఠశాలకు రావాలని విద్యార్థులకు సూచించారు. నాణ్యతో కూడిన బోధన చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు. ఆయన వెంట హెచ్‌ఎం సురేందర్ మోహన్ ఉన్నారు.

## కమిషనర్‌కు వినతి

భైంసా, ఫిబ్రవరి 24 : నిర్మల్ జిల్లా భైంసాలోని భట్టిగల్లీలో గల శివాలయానికి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సోమవారం పలువురు మున్సిపల్ కమిషనర్ రాజేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ కపిల్ మాట్లాడుతూ, శివరాత్రి వస్తున్న సందర్భంగా గ్రావెల్, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు సురేశ్, పోశెట్టి ఉన్నారు.

## ఇందిరమ్మ మోడల్ హౌస్ పరిశీలన

తాంసి, ఫిబ్రవరి 24: ఆదిలాబాద్ జిల్లా తాంసిలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను సోమవారం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మి, హౌసింగ్ ఏఈ నజీర్, ఎంపీడీవో మోహన్ రెడ్డి నిర్మాణ పనులపై సమీక్షించారు. అధికారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ విధి విధానాలను హౌసింగ్ ఏఈని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో లబ్ధిదారుల జాబితాపై చర్చించడంతో పాటు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ వెంకట రమణ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల జాబితా పరిశీలన

ఇచ్చోడ, ఫిబ్రవరి 24 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో మొదటి జాబితాలో ఎంపికైన ఇందిరమ్మ ఇండ్ల జాబితాను పరిశీలిస్తున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. సోమవారం జాబితా ప్రకారం ఇండ్లను పరిశీలించారు. వివరాలు సేకరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సూర్యప్రకాశ్, సిబ్బంది ఉన్నారు.

## పుస్తక నిర్వహణపై శిక్షణ

బోథ్, ఫిబ్రవరి 24: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కుచులాపూర్ గ్రామంలో గ్రామ సంఘ మహిళా సమాఖ్య గ్రామ సంఘ కార్యనిర్వహక సభ్యులకు పుస్తక నిర్వహణపై సోమవారం శిక్షణ ఇచ్చారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్థిక లావాదేవీలు, పుస్తక నిర్వహణ, రుణాలు మంజూరు, చెల్లింపు వాటిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీల, ఏపీఎం మాధవ్, సీసీ విజయలక్ష్మి, జీపీ కార్యదర్శి అశోక్, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## వాలీబాల్ పోటీల విజేత ఖమ్మం జట్టు


గెలుపొందిన జట్టుకు బహుమతి అందజేస్తున్న మాజీ సర్పంచ్ సుగుణ

బోథ్, ఫిబ్రవరి 24: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పట్నాపూర్ గ్రామంలో శ్రీ చైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలో ఖమ్మం జట్టు విజేతగా నిలిచింది. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో 76 జట్లు పాలు పంచుకున్నాయి. ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్ పోటీలో ఖమ్మం, నిర్మల్ జట్లు తలబడ్డాయి. ప్రథమ స్థానంలోని ఖమ్మం జిల్లా జట్టుకు రూ.25111 నగదుతో పాటు జ్ఞాపిక, ద్వితీయ స్థానంలో నిలిచిన నిర్మల్ జిల్లా జట్టుకు రూ.15111, తృతీయ స్థానంలో నిలిచిన నందిగామ జట్టుకు రూ.8111 నగదు అందజేశారు. బహుమతుల ప్రదానోత్సవంలో మాజీ సర్పంచ్ పంద్రం సుగుణ, పంద్రం శంకర్, యూత్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, తొడసం భూమన్న, లాల్‌దేవ్, జల్పత్, పెందూర్ సోనేరావ్, గోపాల్, సాయిదీపక్, వినిత్ కుమార్, జంగరాజ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ

భైంసా, ఫిబ్రవరి 24 : నిర్మల్ జిల్లా భైంసాలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో బాలశక్తి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జబ్బర్ మాట్లాడుతూ, బాలశక్తి కార్యక్రమం లాంఛనంగా ప్రారంభమైందని అందులో భాగంగానే ఈ కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ సాయినాథ్, నర్సింగ్ ఆఫీసర్ రాజుల దీప్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ

ఖానాపూర్, ఫిబ్రవరి 24 : నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని పద్మావతినగర్ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త నాలం అశోక్ అత్తమ్మ, బుర్ర శేఖర్ నాయనమ్మ మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను సోమవారం బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు గౌరికర్ రాజు, సుమిత్, ప్రదీప్ రమేశ్, ఖలీల్ ఉన్నారు.


ఖానాపూర్: బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న భూక్యా జాన్సన్ నాయక్

లోకేశ్వరం, ఫిబ్రవరి 24 : నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని గడ్‌చందా మాజీ సర్పంచ్ వెంకట్‌రావు తల్లి మృతి చెందింది. బాధిత కుటుబ సభ్యులను సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు లోలం శ్యాంసుందర్ పరామర్శించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, మాజీ ఎంపీపీ సాగర్, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ బండి ప్రశాంత్, బీఆర్‌ఎస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు దిగంబర్, నాయకులు అనిల్, సుధాకర్ ఉన్నారు.


లోకేశ్వరం: పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# బ్యాంకులు చేయూతను అందించాలి


పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 24 : మహిళా సాధికారతకు బ్యాంకులు చేయూతను ఇవ్వాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్మల్‌లోని కలెక్టరేట్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి నుంచి ఈ నెల 28వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళల ఉన్నతి కోసం బ్యాంకులు ఎన్నో రకాలుగా సదుపాయాలు కల్పిస్తున్నాయని తెలిపారు. మహిళలకు సంబంధించి ఆర్థిక అంశాలతో ముడిపడి ఉన్న అన్ని రకాల పథకాలపై మహిళలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు చేయూతను ఇవ్వడానికి ఎన్నో పథకాలు ఉన్నాయని మహిళా సాధికారత సాధించడానికి ఎంతగానో తోడ్పడుతాయన్నారు. మహిళలకు పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యత పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ గోపాల్, ఆర్డీవో రత్నకల్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రామారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ నాయకులు, కార్యకర్తలు

ముథోల్, ఫిబ్రవరి 24 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు, జడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ డిమాండ్ చేశారు. సోమవారం నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని తరోడా గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ క్యాలెండర్, డైరీలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెబుతూ కాలయాపన చేస్తున్నదని పేర్కొన్నారు. ఇప్పటి వరకు రూ.2లక్షలకు పైగా రుణమాఫీ, రైతుభరోసా డబ్బులు ఇవ్వలేదన్నారు. ఆరు గ్యారెంటీలు అట్టకెక్కే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. రైతులకు నిరంతర కరెంట్ ఇవ్వాలని లేకపోతే సబ్‌స్టేషన్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు విఠల్, తరోడా మాజీ ఎంపీటీసీ గంగాధర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భయాన్ని వీడితేనే విజయం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 24 : విద్యార్థులు పరీక్షల్లో భయాన్ని వీడితేనే విజయం సాధించవచ్చని నేషనల్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ డైరెక్టర్ మల్లికార్జున్ రావు అన్నారు. సోమవారం నిర్మల్‌లోని ఆర్‌కే కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన వాసవి వరల్డ్, ఒలింపియాడ్ పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించుకున్న లక్ష్యాలకు పునాది హైస్కూల్ విద్య అన్నారు. మంచి లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటిని సాకారం చేసుకునేందుకు నిత్యం కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ముత్యం రెడ్డి, పాఠశాల సెక్రెటరీ జగదీశ్ రెడ్డి, కరస్పాండెంట్ పోతారెడ్డి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, శ్రీనివాస్ శెట్టి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం


పోటీలు ప్రారంభిస్తున్న ఏఎస్ఐ కాత్లే రమేశ్

ఇచ్చోడ(సిరికొండ), ఫిబ్రవరి 24: క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని సిరికొండ ఏఎస్ఐ కాత్లే రమేశ్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని కొండాపూర్ గ్రామంలోని శివాలయం వద్ద నిర్వహించిన వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# సేవాలాల్ జీవిత చరిత్రను ఆచరించాలి


ఎదులాపురం: సేవాలాల్ మహారాజ్ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న మాజీమంత్రి జోగు రామన్న, నాయకులు

ఎదులాపురం, ఫిబ్రవరి 24 : సేవాలాల్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం ఆదిలాబాద్‌లోని రాంలీలా మైదానంలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తాతో కలిసి కలెక్టర్ హాజరై సేవాలాల్ చిత్రపటం వద్ద పూజలు చేశారు. అంతకు ముందు భోగ్ బండరా నిర్వహించారు. కాగా మహిళలు, యువతులు సాంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు చేస్తూ రావడం ఆకట్టుకుంది. కాగా వారితో కలిసి ఐటీడీఏ పీఓ, కలెక్టర్ సాంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు చేయడం ప్రత్యేక ఆకర్షణ నిలిచింది. కార్యక్రమంలో బంజారా సేవ సంఘం జాతీయ అధ్యక్షుడు అమర్‌సింగ్ తిలవత్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాథోడ్ భీంరావ్, గజానంద్, పవన్‌నాయక్, జాదవ్ బలిరాం, శివలాల్ నాయక్, రాథోడ్ సురేశ్ పాల్గొన్నారు.

### జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

ఆదిలాబాద్‌లోని సోమవారం లంబాడీల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పాల్గొని సేవాలాల్ మహారాజ్ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను కేసీఆర్ హయాంలో అధికారికంగా నిర్వహించామని గుర్తు చేశారు. అలాగే ప్రభుత్వ సెలవుగా ప్రకటించి సేవాలాల్ మహారాజ్ ఆధ్యాత్మిక గురు బోధనలు మరింత ప్రాచుర్యం కల్పించేలా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.


ఎదులాపురం: పూజలు చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

# మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు


సమస్యలు తెలుసుకుంటున్న ఆదిలాబాద్ జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 24: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని ఏమాయికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని రమాయినగర్, సుందర్‌నగర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు దశల వారీగా పరిష్కరించడానికి, మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో భాస్కర్, ఇంద్రవెల్లి జీపీ ఈవో సంజీవ రావ్, ఏమాయికుంట జీపీ కార్యదర్శి రమేశ్‌తో ప్రత్యేక సమావేశమైయ్యారు. రమాయినగర్, సుందర్‌నగర్‌లో నివాసముంటున్న కుటుంబాల పూర్తి వివరాలతో పాటు అక్కడ నిర్మాణం చేసిన ప్రభుత్వ కార్యాలయాలు, వేసిన బోర్‌వెల్స్, ప్రైవేట్ బోర్లు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి ట్యాంకు, మిషన్ భగీరథ పథకం పైపులైన్, ఇంటింటా ఏర్పాటు చేసిన నీటి నల్లాలు, చేపట్టిన కులగనణ సర్వేల వివరాలు, ఎంతమంది ఓటర్లు ఉన్నారనేది, అక్కడ ప్రస్తుతంగా నివాసముంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీలతోపాటు ఇతర కులాల వారీగా వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో కలిసి రమాయినగర్, సుందర్‌నగర్‌కు వెళ్లి అక్కడి ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అవసరమున్న మౌలిక సదుపాయాలు కల్పించడానికి తనవంతుగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎదులాపురం, ఫిబ్రవరి 24: ఆదిలాబాద్‌లోని దేవాపూర్ చెక్‌పోస్ట్ వద్ద జాతీయ రహదారిపై కారును లారీ ఢీకొన్న ఘటనలో తృటిలో ప్రాణాపాయం తప్పింది. రిటైర్డ్ డీఎంహెచ్‌వో రాజీవ్ రాజ్, ఆయన కుమారుడు తరుణ్ రాజ్ ఆదిలాబాద్‌కు కారులో వస్తున్న సమయంలో కారును లారీ పక్క నుంచి ఢీకొంది. దీంతో కారు స్వల్పంగా ధ్వంసమైం ది. రిటైర్డ్ డీఎంహెచ్‌వో, కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసినట్లు మావల ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు.

## కుక్కల దాడిలో ఎనిమిది మందికి..

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 24: నిర్మల్‌లోని ఈద్గాం చేపల మార్కెట్, భాగ్యనగర్, కొత్త బస్టాండ్ ప్రాంతాల్లో సోమవారం కుక్కలు దాడిలో వృద్ధురాలు రాజవ్వ, చిన్నారులు సమి, హంజాఖాన్‌తో పాటు ఐదుగురికి గాయాలయ్యాయి. వీరిని స్థానిక దవాఖానల్లో చికిత్స అందించారు. అందరి ఆరోగ్య పరిస్థితి క్షేమంగా ఉందని స్థానికులు తెలిపారు.

## ట్రాన్స్‌ఫార్మర్ తగిలి ఎద్దు మృతి

తాంసి(భీంపూర్), ఫిబ్రవరి 24 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం అంతర్గాం గ్రామంలోని రైతు శీల అనిల్ చెందిన ఎద్దులు సోమవారం సాయంత్రం పెన్‌గంగ ఒడ్డున మేత మేస్తున్నాయి. ఒక ఎద్దు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో షాక్‌తో మృతి చెందింది. ఎద్దు విలువ రూ. లక్ష ఉంటుందని రైతు తెలిపారు.

## పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

కడెం, ఫిబ్రవరి 24: నిర్మల్ జిల్లా కడెం మండలం గంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దేవునిగూడెం గ్రామానికి చెందిన పెంద్రం రాజేశ్వరి (30) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ కృష్ణసాగర్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పెంద్రం రాజేశ్వరి భర్తతో చిన్నపాటి వాగ్వాదం జరగగా మనస్తాపం చెంది పురుగుల మందు తాగింది. దీంతో కుటుంబ సభ్యులు నిర్మల్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. రాజేశ్వరి తల్లి పందిరి సీతాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## డివైడర్‌ను ఢీ కొని ఒకరి మృతి

సోన్, ఫిబ్రవరి 24 : నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని కడ్తాల్ వద్ద నూతనంగా నిర్మించిన అండర్ బ్రిడ్జి సర్వీసు రోడ్డులో డివైడర్‌ను ఢీ కొని ఒకరు మృతి చెందారు. వివరాలకు వెళ్లితే.. జాఫ్రాపూర్ గ్రామానికి చెందిన సుంకరి నర్సయ్య (61) శనివారం ఉదయం నిర్మల్‌లో పని చేసుకొని తిరిగి వస్తున్న క్రమంలో కడ్తాల్ సర్వీసు రోడ్డు మధ్యలో గల డివైడర్ కనిపించకపోవడంతో దానికి ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు హుటాహుటిన దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

## అనుమానాస్పదంగా యువకుడు..

గుడిహత్నూర్, ఫిబ్రవరి 24 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన దెక్కం రమేశ్ అనే యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన సోమవారం బయటపడింది. దెక్కం రమేశ్ శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. మృతుడి తల్లి రెండు రోజులపాటు బంధువులు, మిత్రుల ఇళ్లలో వెతికినప్పటికీ అతని ఆచూకీ తెలియలేదు. సోమవారం ఉదయం మండల కేంద్రం నుంచి లింగాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో మొక్కజొన్న తోట సమీపంలో గుర్తు తెలియని యువకుని మృతదేహం ఉన్నట్లు పోలీసులకు గ్రామస్తులు తెలియజేశారు. కుళ్లిపోయిన స్థితిలో కనిపించడంతో మృతుడి ఒంటిపై ఉన్న బట్టలతో తల్లి గుర్తుపట్టి తన కుమారుడని చెప్పింది. అయితే మొక్కజొన్న పంట రక్షణ కోసం విద్యుత్ తీగలు అమర్చి ఉండడంతో కరెంట్ షాక్ తగిలి మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుని తల్లి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇచ్చోడ సీఐ భీమేశ్ తెలిపారు.

## ఆశ్రమోన్నత బాలుర పాఠశాల తనిఖీ


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

తాంసి, ఫిబ్రవరి 24: ఆదిలాబాద్ జిల్లా తాంసిలోని ఆశ్రమోన్నత బాలుర పాఠశాలను సోమవారం ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, తరగతుల నిర్వహణ, భోజనం నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో ఆమె మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఆమె వెంట ఉపాధ్యాయులు, అధికారులు ఉన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేయం..



మాట్లాడుతున్న భీంపూర్ మండల గ్రాడ్యుయేట్ జేఏసీ సభ్యులు

ఎదులాపురం, ఫిబ్రవరి 24 : 'దశాబ్దకాలంగా రోడ్డు సమస్యతో అవస్థలు పడుతున్నాం.. ఎన్ని ప్రభుత్వాలు మారినా మా ప్రాంతానికి రోడ్డు సమస్య తీరడం లేదు. ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకున్న నాథుడే లేడు. అందుకే మా మండలాన్ని మహారాష్ట్రలో కలపండి.. లేకపోతే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయం..' అని ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండల గ్రాడ్యుయేట్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ కమిటీ సభ్యుడు నరేశ్‌రెడ్డి మాట్లాడారు. రానున్న రోజుల్లో దశలవారీగా రోడ్డు సాధన కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. మా గ్రామాల్లో ఏ నాయకుడిని, అధికారులను తిరగనివ్వమని హెచ్చరించారు. మాకు మేమే స్వయం పాలన చేసుకుంటామని స్పష్టం చేశారు. ఇందులో బొంత నితిన్, శైలెందర్ యాదవ్, నితిన్ యాదవ్, లతీఫ్, శ్రీనివాస్ యాదవ్, ఆయా గ్రామాల గ్రాడ్యుయేట్లు పాల్గొన్నారు.

## కూలీల రేట్లు పెంచాలి


కూలీలతో మాట్లాడుతున్న నాయకుడు దుర్గం నూతన్ కుమార్

దస్తురాబాద్, ఫిబ్రవరి 24: పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కూలీల రేట్లు పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని బుట్టాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల రేట్లు రూ.800కు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, ప్రతి గృహిణికి రూ.2500 పథకాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ నాయకులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నిర్మల్‌అర్బన్, ఫిబ్రవరి 24 : నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన ప్రసాద్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. 2000–01లో ఆయనతో పదో తరగతి చదువుకున్న మిత్రులు బాధిత కుటుంబానికి రూ.40 వేలు అందజేశారు. ఇక్కడ ప్రవీణ్, సాగర్, అశోక్, సురేందర్, సతీశ్, గణేశ్, రాజేందర్ ఉన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించాలి


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కుభీర్, ఫిబ్రవరి 24 : వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి గురువులు, తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని ప్రిన్సిపాల్ సునీల్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. సోమవారం నిర్మల్ జిల్లా కుభీర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కళాశాలకు విలువైన భూమిని దానం చేసిన భూదాత దొంతుల లింగన్నను సత్కరించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.